శనివారం 28 మార్చి 2026
అగ్నిధార

# శ్రీరామనవమి వేడుకల్లో భక్తులకు మజ్జిగ పంపిణీ

**రామగుండంలో వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ సేవలు**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

శ్రీరామనవమి సందర్భంగా రామగుండం నియోజకవర్గం లో భక్తుల దాహార్తి తీర్చేందుకు వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ, చలివేంద్ర కేంద్రాలను ప్రారంభించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్ రెడ్డి పలు ప్రాంతాల్లో ఈ సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఎనిమిదవ కాలనీ, గోదావరిఖని కోదండ రామాలయం, గంగానగర్ చంద్రశేఖర్ నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన సీతారామ కళ్యాణోత్సవాల సందర్భంగా భక్తులకు ఉచితంగా మజ్జిగ, అన్నప్రసాదం అందించారు. గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని ఐబి కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద కూడా భక్తులకు సేవలు అందించామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీరామనవమి పురస్కరించుకుని నిర్వహిస్తున్న సీతారామచంద్ర కళ్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని, వారి సౌకర్యార్థమే ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. భక్తులు స్వామివారి ఆశీర్వచనం పొందేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

**రాజకీయ వ్యాఖ్యలు:**

రాష్ట్ర రాజకీయాలపై కూడా ఆయన స్పందించారు.



తెలంగాణలో ప్రస్తుత పరిస్థితులపై విమర్శలు చేస్తూ, ప్రజలు మార్పు కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి ప్రజల ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు.

సామరస్యానికి నిదర్శనం: ఈ కార్యక్రమాల్లో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం విశేషంగా నిలిచింది. ముఖ్యంగా ముస్లిం సోదరులు కూడా పాల్గొనడం సామాజిక ఐక్యతకు నిదర్శనంగా మారింది. ఈ కార్యక్రమంలో తస్నీంబాను, జాహిద్ పాషా, అక్బర్, అబ్దుల్ కదీర్, తహసీన్, మొయిన్ రాజ్ మహమ్మద్, పొలాడి శ్రీనివాస్ రావు, వంశీ కృష్ణ, కొండా సురేష్, బొబ్బిలి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వీర జవాన్ జాతీయ పురస్కారం అందుకున్న రిటైర్డ్ ఆర్మీ జవాన్



**అగ్నిధారా న్యూస్, కమాన్ పూర్ :**

పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ కుక్క కుమార్ వీర జవాన్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతి లో వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరా జవాన్ జాతీయ పురస్కారం అందుకున్నారు. కుక్క కుమార్ డిఫెన్స్ అకాడమీ ఏర్పాటు చేసి ఉచితంగా ఎంతోమందికి ట్రైనింగ్ ఇచ్చి సైన్యం వైపు వెళ్లేలా చేస్తున్న కృషి సేవలను గుర్తించి ఈ జాతీయ పురస్కారాన్ని అందజేశారు.

## శ్రీరామనవమి సందర్భంగా అన్నదానం చేసిన యువ నాయకులు ఇనగంటి రామారావు



**అగ్ని ధార న్యూస్, కమాన్ పూర్ :**

పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకులు ఇనగంటి రామారావు తన జన్మదినం మరియు శ్రీరామనవమి పురస్కరించుకుని శుక్రవారం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం సీతారాముల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించగా.. ఈ కళ్యాణానికి విచ్చేసిన సుమారు 1000 మంది భక్తులకు రామారావు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. 2014 నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం శ్రీరామనవమి తన సందర్భంగా భక్తులకు రామారావు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు.

# ఇరాన్ పై అమెరికా- ఇజ్రాయిల్ యుద్ధాన్ని మోడీ ఖండించాలి

మోడీ వైపల్యం వల్లే గ్యాస్ పెట్రోల్ డీజిల్ ఇబ్బందులు

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తీగల సాగర్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలని, ప్రపంచ శాంతి కోసం భారత ప్రభుత్వం ఇతర దేశాలతో కలిసి కృషి చేయాలని మోడీ వైపల్యం వల్లే గ్యాస్ పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పడి భారత ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తీగల సాగర్ అన్నారు .యుద్ధం వద్దు శాంతి ముద్దు గ్యాస్ పెట్రోల్ డీజిల్ కొరతను అరికట్టాల్సిన మన కేంద్ర ప్రభుత్వానికి ఉన్నదని కల్వకుర్తి పార్టీ కార్యాలయంలో జరిగిన సిపిఎం కార్యదర్శివర్గ సమావేశానికి హాజరైన ఆయన అమెరికా ఇజ్రాయిల్ దేశాలు అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా కనీసం మానవత విలువలు పాటించకుండా దాడి చేయడాన్ని ప్రపంచమంతా ముక్త కంఠంతో ఖండించాలని అన్నారు. ఇరాన్ అంతర్జాతీయ అణు ఒప్పందానికి అనుగుణంగా విద్యుత్ ప్రయోజనాలకే అణు కార్యక్రమం చేపడతామని ప్రకటించిందన్నారు .ఇరాన్ అణుబాంబు తయారు చేయడం లేదని అమెరికా ఉగ్రవాద నిరోధక విభాగం ప్రకటించిందని అయినా అణ్వాయుధాలు ఉన్నాయనే నెపంతో దాడి చేయడం దుర్మార్గం అని అన్నారు. ఇరాన్ లో తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించి ఇరాన్ చమురు నిల్వలను కొల్లగొట్టాలనే కుట్రతోనే అమెరికా ఇలాంటి దుస్సాహసానికి పాల్పడిందని విమర్శించారు. భారత ప్రభుత్వం మన అలీన విదేశాంగ విధానాన్ని వదిలేసి అమెరికా ఇజ్రాయిల్ వైపు మొగ్గు చూపుతున్నదని, యుద్ధం ఆపడానికి కృషి చేయకుండా అమెరికాకు లొంగుబాటు వైఖరి తీసుకున్నదని దుయ్యబట్టారు. యుద్ధం వల్ల గ్యాస్ సిలిండర్ల ధరలు పెరిగి సాధారణ ప్రజల పైన వేల కోట్ల రూపాయల భారం పడింది. గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత కారణంగా ప్రజలు క్యూ లైన్లలో నిలబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. హోటల్స్, హాస్టల్స్ మూతపడ్డాయి, వేలాది మంది ఉపాధి కోల్పోయారని అన్నారు. గల్ఫ్ దేశాలలో కోటి మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారని యుద్ధం వల్ల వారి ప్రాణాలు, ఉపాధి ప్రమాదంలో పడ్డాయని అన్నారు. అమెరికాకు భయపడి యుద్ధం పట్ల నోరు మెదపకుండా ఉన్న మోడీ యుద్ధం వల్ల దేశం కరోనా నాటి పరిస్థితిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ప్రజలకు పిలుపునివ్వడం సిగ్గుచేటని అన్నారు. ప్రపంచ శాంతి కోసం, యుద్ధాల వలన జరిగే నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు మోడీ విధానాలను ఖండించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో,జిల్లా కార్యదర్శి వరదం పర్వతాలు, తో పాటు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులు కందికొండ గీత,ఎల్. దేశ్యనాయక్ బి. ఆంజనేయులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

## వాంకిడి లో ఉచిత ట్యూషన్ ఫలితాలు..



**6 మందికి గురుకుల సీట్లు**

**అగ్నిధార న్యూస్ ,(వాంకిడి):**

సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో వాంకిడి మండల కేంద్రంలోని జేతవన్ బుద్ధ విహారంలో గత ఐదు నెలలుగా నిర్వహిస్తున్న ఉచిత ట్యూషన్ కార్యక్రమం మంచి ఫలితాలను అందించింది. జిల్లా సంఘటకులు మార్షల్ దుర్గం సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ ద్వారా గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షలకు హాజరైన 9 మంది విద్యార్థుల్లో 6 మంది గురుకులాల్లో సీట్లు సాధించడం హర్షణీయమని ఆయన తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులు: రామ్‌టెంకి తపశ్వి (టీఎస్డబ్ల్యూఆర్ఎస్ రెబ్బెనా), ఉప్రే హర్షిణి (ఎంజేపీ ఆసిఫాబాద్), దుర్గం సహస్ర (ఎంజేపీ ఆసిఫాబాద్), బి. గాడ్లీ (టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ ఆసిఫాబాద్), చునార్కర్ వర్షిణి (ఎంజేపీ ఆసిఫాబాద్), వడై కార్తిక (ఎంజేపీ ఆసిఫాబాద్) విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందారు.

ఈ సందర్భంగా దుర్గం సందీప్ మాట్లాడుతూ, ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు ఉచితంగా ట్యూషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో గురుకుల, నవోదయ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్‌తో పాటు చదవడం, రాయడం, గణిత ప్రాథమిక నైపుణ్యాలపై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొందించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం లక్ష్యంగా కార్యక్రమం కొనసాగుతున్నదన్నారు.

ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమానికి సహకరిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం, వాంకిడి సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నంచర్లలో విషాదం -- చెరువులో పడి విద్యార్థి మృతి, అంత్యక్రియల సమయంలో కుటుంబానికి ఆర్థిక సహాయం



**అగ్నిధార న్యూస్**

మహమ్మదాబాద్: మండలం నంచర్ల గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కడు బీద కుటుంబానికి చెందిన మంగలి పెంటయ్య కుమారుడు రామాంజనేయులు (12) గురువారం ప్రమాదవశాత్తు గ్రామ సమీపంలోని చెరువులో పడి మృతి చెందాడు. రామాంజనేయులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థి. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. చిన్న వయస్సులోనే బాలుడు మృతి చెందడం గ్రామస్తులను కుదిపేసింది. విషయం తెలిసిన వెంటనే గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, యువజన సంఘ సభ్యులు, యువకులు సంఘటనా స్థలానికి చేరుకుని బాలుని కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబం ఆర్థికంగా వెనుకబడినది కావడంతో గ్రామస్తులు ముందుకు వచ్చి తమ వంతు సాయంగా నిధులు సేకరించారు. సుమారు రూ.1 లక్ష వరకు నగదు సేకరించి, శుక్రవారం జరిగిన అంత్యక్రియల సమయంలోనే బాధిత కుటుంబానికి అందజేశారు.

ఈ సందర్భంగా గ్రామస్తుల సహాయానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆంజనేయులు కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. గ్రామ ప్రజల ఐక్యత, మానవత్వం మరోసారి వెలుగులోకి వచ్చిన సంఘటనగా ఇది నిలిచింది.

## గురుకుల లో సీటు సాధించిన శ్రీ అక్షర గ్రామర్ స్కూల్ విద్యార్థిని నంచర్ల అవంతిక



**అగ్నిధార న్యూస్‌మహమ్మదాబాద్:**

మహబూబ్నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం నంచర్ల గేట్ ఎక్స్ రోడ్డు లో ఉన్న శ్రీ అక్షర గ్రామర్ స్కూల్లో నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థిని అవంతిక గురుకుల అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి నంచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీటు పొందింది అవంతిక తల్లిదండ్రులు దాదాపురం శ్రీనివాస్ ఆమె సాధించిన ఈ విజయంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలో ఆనందం వ్యక్తమయింది ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రహ్లాద రెడ్డి ఉపాధ్యాయుల బృందం విద్యార్థిని అభినందించారు చిన్నవయసులోనే పట్టుదలతో చదివి ఈ విజయాన్ని సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు భవిష్యత్తులో కూడా ఇలాగే కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు అలాగే తల్లిదండ్రులు గ్రామస్తులు అవంతికను అభినందించారు

## ఏప్రిల్ 25న వస్తున్నాము

## కవిత ప్రకటన

**హైదరాబాద్ :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన రాజకీయ పార్టీ ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25వ తేదీన తన పార్టీని అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిపారు. తాను సొంతంగా ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపించబోతున్నట్లు ఇప్పటికే ఆమె పలు సందర్భాల్లో వెల్లడించడం తెలిసిందే. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ఏప్రిల్ 25న ఉదయం 8 గంటలకు పార్టీ ఆవిర్భావ సభను నిర్వహించనున్నట్లు కవిత పేర్కొన్నారు.

## అపరమేధావికి సినీ హీరో సన్మానం

**అగ్నిధారన్యూస్ ఖమ్మం**



ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డా.గుగ్గిళ్ళ దివ్యమూర్తికి తెలంగాణ ఫిలిం జేఏసీ చైర్మన్ సినీ హీరో రోషం బాలు చేతుల మీదుగా శాలువాతో ఘనంగా సన్మానం జరిగింది. ఎల్బీనగర్ లో ఒక కార్యక్రమంలో ఈ సన్మానం జరిగింది. దివ్యమూర్తి యొక్క ప్రతిభను చూసి ఈ సన్మానం చేస్తున్నట్లు రోషం బాలు తెలియజేశారు. దివ్యమూర్తి లాంటి వారు సమాజానికి ఎంతో అవసరమని రోషం బాలు తెలియజేశారు. గొప్ప వ్యక్తికి సన్మానం చేయడం నాకు ఆనందకరమని రోషం బాలు తెలియజేశారు. ఈ సన్మానం జరగడం తనకు సంతోషంగా ఉందని దివ్యమూర్తి తెలియజేశారు. ఇప్పటివరకు తనకు 127 వేదికల మీద సన్మానం జరిగిందని దివ్యమూర్తి తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో వీరమోహన్, రఘు, రఘురాం, ఋషి, తదితరులు ,పాల్గొన్నారు.

